క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఓనం పండుగ



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

నంద్యాల(వ్యవసాయం):పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీఅయ్యప్ప స్వామి దేవస్థానంలో శ్రీస్వామి అయ్యప్ప సేవాసమాజ్ ఆధ్వర్యంలో బుధవారం కేరళ రాష్ట్రం సంప్రదాయ పండుగ అయిన ఓనంను పురస్కరించుకొని అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో రంగవల్లులు వేసి పూలతో అలంకరించారు. అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ అనంతరం పట్టువస్త్రాలచే అలంకరించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సభ్యులు నాగరాజు, శ్రీకాంత్, రామలింగారెడ్డి, సుబ్బయ్య, లక్ష్మయ్య, అర్చకుడు గోపిస్వామి పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతలు

శిరివెళ్ల: జగనన్న కాలనీలలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత కోసం ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రోత్సహిస్తుంది. అందులో భాగంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఇంటి ముందు గుంత నిర్మాణానికి రూ. 6 వేలు మంజూరు చేసింది. స్థానిక జగనన్న కాలనీలో 11 గుంతలు, గంగవరం 16, గోవిందపల్లె 11, యర్రగుంట్లలో 31 గుంతల నిర్మాణాలు మొదలయ్యాయి.

నూతన పింఛన్లు మంజూరు

శిరివెళ్ల: మండలానికి కొత్తగా వైఎస్సార్ కానుక పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. మండల కేంద్రం శిరివెళ్లకు 37, యర్రగుంట్ల 17, గోవిందపల్లె 22, గుంప్రమాన్‌దిన్నెకు 9, బోయలకుంట్ల 7, చెన్నూరు 16, గండంపాడు 7, గంగవరం 5, మహదేవపురం 10, గుండంపాడు 9 పింఛన్ల మంజూరయ్యాయని వివరించారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టండి

గోస్పాడు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని ఈఓఆర్డీ అనసూయ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో మురుగు నీటి సమస్యలు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని తెలిపారు. మురుగు నీరు నిల్వ వల్ల దోమలకు ఆవాసంగా మారతాయని చెప్పారు.

నంద్యాల కవికి జాతీయ పురస్కారం



గిడుగు రామ్మూర్తి పురస్కారం అందుకుంటున్న ప్రసాద్

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల కవి కొప్పుల ప్రసాద్‌కు గిడుగు జాతీయ సాహితీ పురస్కారం లభించింది. బుధవారం కవి ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ శంకర వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తాను రచించిన చిరుగాలి పలకరిస్తే కవితా సంపుటికి సాహితీ పురస్కారం లభించిందని తెలిపారు. శాలువాలు, మెమొంటో, ప్రశంసా పత్రంతో నిర్వాహకులు సన్మానించారని చెప్పారు. నంద్యాలకు చెందిన ప్రముఖులు, సాహితీ ప్రియులు రామసుబ్బయ్య, మహేశ్వరి, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రవికృష్ణ, రామచంద్రారావు, ఉదయ్‌శంకర్ అభినందనలు తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్):ఫుట్‌బాల్‌పోటీల్లోకేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని హెచ్ఎం అసదుల్లా హుసేన్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ గేమ్ పోటీల్లో తమవిద్యార్థి నులు రాణించారని చెప్పారు. గెలుపొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ప్లేట్లు, గ్లాసుల విరాళం

శిరివెళ్ల: కామినేనిపల్లె అంగన్‌వాడీ కేంద్రానికి సర్పంచు మేర్వ చిన్న నరసింహారెడ్డి బుధవారం ప్లేట్లు, గ్లాసులు విరాళంగా అందజేశారు. భోజనం చేసేందుకు చిన్నారులు ఇంటి నుంచే ప్లేట్లు తెచ్చుకుంటున్నారని గమనించి అవసరమైనన్ని అందచేశారు. విరాళం పట్ల చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిపక్షాల విమర్శలకు పార్లమెంట్ సమాధానం చెంపపెట్టు



రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న గంగుల, ఎంపీ పోచా



చాకరాజువేములలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న గంగుల, ఎంపీ పోచా

ఉయ్యాలవాడ: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు పార్లమెంట్‌లో ఆయా శాఖల మంత్రులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ పాలన సాగిస్తుందని చెప్పడం చెంపపెట్టులాంటిదని ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం ఉయ్యాలవాడ నుంచి కొండుపల్లె వరకు రూ. 9.50 కోట్లతో నిర్మాణం చేపట్టనున్న తారు రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా వేధిస్తున్న రోడ్డు సమస్య గురించి సీఎం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే రూ. 9.50 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో సర్వాయిపల్లె నుంచి చిన్నకందుకూరు మీదుగా హైవే వరకు రోడ్డు నిర్మాణం, ఆర్.పాంపల్లె నుంచి హరివరం వరకు రహదారి నిర్మాణాలకు కూడా త్వరలోనే నిధులు మంజూరవుతాయన్నారు. పంచాయతీ రాజ్ డీఈఈ లక్ష్మీనరసింహుడు మాట్లాడుతూ ఉయ్యాలవాడ నుంచి కొండుపల్లె వరకు చేపట్టిన 6 కి.మీ. పొడువున తారురోడ్డుతో పాటు రహదారిలో 7 వంతెనలు, 150 మీటర్ల పొడువున రక్షణ గోడలు, 350 మీటర్ల పొడువున సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను 6 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మీదేవి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పోచా వెంకటరెడ్డి, పల్లె మహేశ్వరరెడ్డి, బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, మండల బూత్ కన్వీనర్ పల్లె గురుప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు దేశం సోమశేఖర్‌రెడ్డి, మేకల ఓబులేస్, కాంట్రాక్టర్ శివరామకృష్ణారెడ్డిఅధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

దొర్నిపాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో రూ.1.21 కోట్లతో సీసీ రోడ్లు, చాకరాజువేముల, వెంకటేశ్వరనగరంలో రూ.48 లక్షలతో సీసీరోడ్లు, రూ.46 లక్షలతో దొర్నిపాడులో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను పూర్తి చేశామన్నారు. ఆరు దశాబ్దాలుగా రోడ్డు లేక కేసీ కాల్వకట్ట వెంట వెళ్తున్న వెంకటేశ్వనగరంకు రూ.2.27కోట్లతో నూతనంగా బీటీ రోడ్డు వేశామన్నారు. కంపమల్ల మెట్ట నుంచి డబ్ల్యూ గోవిందిన్నె, చాకరాజువేముల నుంచి డబ్ల్యూ గోవిందిన్నె వరకు ఆర్అండ్‌బీ రోడ్లు మంజూరయ్యాయన్నారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల సొసైటీచైర్మన్ భూమా చెంచిరెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తులనాగేశ్వరరావు, సర్పంచులు పద్మిని, దేవమణి, ఎంపీటీసీ షాజహాన్, ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధంరాఘవరెడ్డి, నాయకులు మోహన్‌నాయుడు, రాఘవులు, వెంకటేశ్వరరావు, త్రినాథచౌదరి, శీను, సుబ్బయ్య, పెద్ద రామచంద్రుడు, హుసేన్‌బాషా, మాబాషా, జాకీర్, శాంతయ్య పాల్గొన్నారు.

సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్





విక్రయాలకు సిద్ధంగా ఉన్న రాఖీలు

- నేడు రక్షాబంధన్
- శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున రాఖీ పౌర్ణమి

నంద్యాల(వ్యవసాయం)/గోస్పాడు: సనాతన సాంప్రదాయం ప్రకారం శ్రావణ మాసంలో రాఖీ పౌర్ణమి నిర్వహించుకోవడం అనవాయితీగా మారింది. మారింది. గతంలో ఎక్కడో ఒక చోట జరుపుకొనే రక్షాబంధన్ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సైతం సోదర సంబంధం చూపేందుకు నిర్వహించుకుంటున్నారు. రాఖీపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని వ్యాపారులు సైతం రాఖీలను గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు విక్రయాలు చేస్తున్నారు. రాఖీలు కూడా పలు రకాల్లో, వినూత్న డిజైన్లలలో చూపరులను ఆకట్టుకునేలా రూపొందించారు. సోదరులకు కట్టేందుకు అక్కా చెల్లెమ్మలు రాఖీల కొనుగోళ్లకు సిద్ధమయ్యారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని వ్యాపారులు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల వద్ద ఒక్కొక్కటి రూ.10 నుంచి గరిష్ఠంగా రూ.100 నుంచి రూ.200 వరకు ధరలు పలికే రాఖీలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

ఆకట్టుకునేలా రాఖీలు..

రాఖీల్లో కూడా చిన్న పిల్లలు ఆకర్షించేలా పలు రూపాల్లో రాఖీలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. గతంలో రాఖీలు స్పాంజీలు, మెరుగు కాగితాలు, డిజైన్లు కనిపించడంతో పాటు జిగ్గితో కుట్టిన వాటిని మెరుపు కాగితాలపై డిజైన్ కనిపించేది. అయితే ప్రస్తుతం అవి కాస్త బట్ట ముక్కలు, రంగురంగుల పూసలు ఇతర దేవత ప్రతిమలతో కూడిన వాటితో పాటు రంగురాళ్లతో చేసిన రాఖీలు మార్కెట్లో అందుబాటులో ఉండటంతో డిమాండ్ పెరిగింది. చిన్న పిల్లలను ఆకట్టుకునేలా రాఖీలు డిజైన్లలో లభ్యమవుతున్నాయి. ఇవే కాకుండా ప్రస్తుత ఆధునిక సమాజంలో సెల్‌ఫోన్ల ద్వారా ఆన్‌లైన్ నుంచి రాఖీలను బుకింగ్ చేసుకుంటూ ఇష్టమైన వాటిని ఇంటి వద్దకే వచ్చేలా ఆర్డర్లు చేసుకుంటూ రాఖీలను తెచ్చుకుంటున్నారు.

వ్యక్తిపై దాడి..నలుగురిపై కేసు నమోదు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన చాకలి పెద్దయ్య అనే వ్యక్తిని నలుగురు దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ బుధవారం తెలిపారు. పొలంలో నీళ్లు మళ్లించుకునే విషయంలో పెద్దయ్యపై సంజీవరాయుడు, నాగర్జున, నాగేంద్ర, లక్ష్మీదేవి కలిసి దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాది మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చెప్పినవి చేస్తున్నందునే ఇంటింటికీ వెళ్తున్నాం



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల (సిటీ): ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నందునే నేడు తాము ఇంటింటికీ వెళ్తున్నామని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంఎస్ నగర్‌లో వార్డు ఇన్‌చార్జ్ పోలూరు రామచంద్రుడు, కౌన్సిలర్ పొలూరు లక్ష్మీదేవితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కాలనీకి చేరుకున్న ఆయనకు స్థానిక నాయకులు, ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది.ఈ సందర్భంగా వార్డులోని సమస్యలను ఎమ్మెల్యేకు దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్ అందజేసి లబ్ధి పొందిన పథకాలు, మొత్తం గురించి వివరించి, పాలన గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే.. గత ప్రభుత్వాల పాలన, జగనన్న పాలనలోని తేడాలు, పథకాల వర్తింపు గురించి వారికి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కారం చేస్తున్నందునే గడప గడపకు ధైర్యంగా వెళ్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, నాయకులు కృష్ణారెడ్డి, రామకృష్ణ, సత్తార్, షరీఫ్, తులసి, దివాకర్, రవి, శంకర్, లోకేష్, మధు, చోటు, రాజేష్, ఆదిరెడ్డి భాస్కర్ రెడ్డి, సాయిరాం రెడ్డి పాల్గొన్నారు.

మోస్తరు వర్షం



ఇంజేడు సమీపంలో పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

ఉయ్యాలవాడ : వరుణ దేవుడు కరుణించడంతో బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మండలంలో మోస్తరు వర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు మాసాలు గడుస్తున్నా సరైన వర్షం కురవక పోవడంతో వరుణ దేవుడి కటాక్షం కోసం ఆయా గ్రామాల్లో ప్రజలు దేవుళ్లకు పూజలు చేశారు. సాయంత్రం ఉన్నట్లుండి ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. ఎండు దశకు చేరుకున్న పంటలకు, మిరప నాట్లు వేసేందుకు ఈ వర్షం ఎంతో ఊరట కలిగిస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

సమగ్ర వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు



ఆర్.నాగులవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రుద్రవరం: సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల మిర్చి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాస్త్రవేత్త ఆదినారాయణ సూచించారు. మండలంలోని ఆర్.నాగులవరంలో బుధవారం మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, ఉద్యాన అధికారి నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శాస్త్రవేత్త, జిల్లా వనరుల కేం ద్రం ఏడీఏ సరళమ్మ, ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు మిర్చి రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మిరప సాగులో పటించాల్సిన పద్ధతులను వివరించారు. మొక్కలకు సూక్ష్మ పోషకాలు అందేలా ఎరువులు వేయాలని, తొలి దశలో ఆకు ముడత తెగులు రాకుండా తగిన మందులు వాడాలని, అలాగే మొక్క మొక్కకు కనీసం మూడడుగుల దూరం ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఏఈఓ రాజు, వీఏఏ నాగఫణీంద్ర కుమార్ ఉన్నారు.

104 మందికి వైద్య పరీక్షలు



నల్లవాగుపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

రుద్రవరం: మండలంలోని నల్లవాగుపల్లెలో ఆలమూరు పీహెచ్‌సీ వైద్యులు బుధవారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు అమర్‌నాథ్‌రెడ్డి గ్రామంలోని 104 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి గర్భిణులు,బాలింతలకు పోషక విలువలున్న ఆహార పదార్థాలను తీసుకోవాలని వివరించారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న రోగుల ఇళ్లవద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు.

పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించండి

- ఇంటింటి ఓటర్ల పరిశీలన వంద శాతం జరగాలి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్‌మనజీర్‌జిలానీ శామూన్

నంద్యాల: ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా పారదర్శకమైన జాబితా రూపకల్పనకు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనపై ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా పారదర్శకమైన జాబితా రూపొందించాలన్నారు. బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి వంద శాతం ఓటర్ల వివరాలను పరిశీలించాలన్నారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు అన్ని రకాల ఫారం -6, 7, 8లకు సంబంధించి 1,20,078 దరఖాస్తులు స్వీకరించామని పెండింగులో ఉన్న 68,954 ఫారంలను పకడ్బందీగా ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలని సూచించారు. ఒక పోలింగ్ స్టేషన్‌లో 2శాతం ఓట్ల తొలగింపులు, 4శాతం ఓట్ల చేర్పులు ఉంటే ఈఆర్ఓలు నిశితంగా పరిశీలించి ఇందుకు సంబంధించిన కారణాలను పేర్కొనాలని కోరారు. ఓట్ల తొలగింపుకు సెప్టెంబర్ 2లోపు నివేదికలు ఇవ్వాలన్నారు. ఎన్‌జీఓ కాలనీ, రైతునగర్‌లలో డబుల్ ఓట్లు ఉన్నట్లు రాజకీయ పక్షాలు లేవనెత్తిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారించాలని సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓలను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జాబితాలో ఓటర్లను ఏ కారణం చేత తొలగిస్తున్నమో సంబంధిత వివరాలను బీఎల్ఓల దగ్గర నుంచి తీసుకొని స్పష్టంగా పేర్కొనాలన్నారు. ఎన్నికలకు సంబంధించి భౌతికంగా అన్ని రికార్డులు సక్రమంగా ఉంచాలన్నారు. డీఆర్ఓ పుల్లయ్య, నియోజకవర్గాల ఈఆర్ఓ, ఏఈఆర్ఓలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఉయ్యాలవాడ: యువతిని దుర్భాషలాడిన వారిపై బుధవారం కేసు నమోదు చేశామని ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని హరివరం గ్రామానికి చెందిన సూదుల దస్తగిరిరెడ్డి మూడు మాసాల క్రితం గ్రామంలో పంచాయతీ తరపున మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే పైపులైన్ విషయంలో అదే గ్రామానికి చెందిన బొల్లవరం కార్తీకరెడ్డి, బొల్లవరం వెంకటసుబ్బారెడ్డి, రఘురామయ్య నిర్మాణ పనులు సమయంలో రోడ్డుకు తక్కువ లోతులో ఏర్పాటు చేయడంతో తమకు ఇబ్బంది కలుగుతుందని ఘర్షణ పడ్డారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని వారు ముగ్గురు బుధవారం ఉదయం దస్తగిరిరెడ్డి లేని సమయంలో ఇంటి వద్దకు వెళ్లి అతని కుమార్తెను దుర్భాషాలాడారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

పాత పద్ధతిలో ప్రమోషన్లు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): వీఆర్ఓ ప్రమోషన్లకు పాత పద్ధతినే అవలంభించాలని, వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు కోరారు. బుధవారం సంఘం నాయకులు సీఐటీయూఐ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగేష్ మాట్లాడుతూ వీఆర్ఏల నుంచి రికవరీ చేసిన అమౌంట్‌ను తిరిగి ఇవ్వాలన్నారు. అనంతరం డీఆర్ఓ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. నాగరాజు, భూపాల్, రామసుబ్బయ్య, అబ్దుల్‌గఫార్, మహేష్ పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి తగ్గిన నీటిసరఫరా

జూపాడుబంగ్లా: శ్రీశైలం డ్యాంలో నీటిమట్టం 853.40అడుగులకు చేరటంతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ఐదుగేట్ల ద్వారా కేవలం 3వేల క్యూసెక్కుల నీరు మాత్రమే ఎస్సార్బీసీ కాల్వలోకి వెళ్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. సాయంత్రం పోతిరెడ్డిపాడు వద్ద 852.40అడుగుల నీటిమట్టం నమోదైందన్నారు. ప్రస్తుతం విడుదలవుతున్న నీటిని బానకచర్ల నీటిని యంత్రణ వ్యవస్థ నుంచి ఎస్సార్బీసీ కాల్వకు 2,500క్యూసెక్కులు, కేసీ ఎస్కేప్ కాల్వకు 500క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులు ప్రతిభ చూపాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పనలో ప్రతిభ చూపాలని గోస్పాడు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజా హుసేన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రసూల్ మైండ్ కంపెనీ మెంటర్ గైడెన్స్ వారి సహకారంతో ఎలక్ట్రానిక్ పరికరాలు, సెన్సార్‌ను ఉపయోగించి మూడు రకాల టాస్కులు ఇచ్చారని, ముందుగా మూడు ప్రాజెక్టుల నిర్వహణపై విద్యార్థులకు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు శిక్షణ ఇచ్చామన్నారు. మూడు ప్రాజెక్టుల్లో భాగమైన కవచ్ అనే ప్రాజెక్టు రూపకల్పనలో 8, 9 తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఎదురెదురుగా రెండు రైళ్లే వస్తే యాక్సిడెంట్లు ఎలా నివారించాలనే అంశాన్ని రూపొందించడంలో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. కేజీబీవీ విద్యార్థినులు ఆటోమేటిక్ స్పీడ్‌బ్రేకర్ యాక్సిడెంట్ రెడ్యూసర్ అనే ప్రాజెక్టు చేసి రెండో స్థానంలో నిలిచారు. అలాగే గోస్పాడు హైస్కూల్ విద్యార్థులు ఆటోమేటిక్ లైటింగ్ సిస్టమ్ ఇన్ రైల్వే స్టేషన్ ప్రాజెక్టు చేసి మూడవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు స్కూల్ లెవెల్ సర్టిఫికెట్లు, మెమొంటోలను అందజేశారు.

ఏసీబీ అధికారుల తనిఖీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో గతంలో జరిగిన అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వాటర్‌సిస్టమ్‌ను ఏసీబీ అధికారులు పరిశీలించారు. ఈ పరిశీలన గత రెండు రోజులుగా సాగుతోంది. బుధవారం ఏసీబీ సీఐ వంశీనాథ్ నేతృత్వంలో ఆ శాఖ ఇంజనీరింగ్ అధికారులు డీఈ రామకృష్ణ, ఏఈ శ్రీనివాసులు క్షేత్రపరిధిలోని పలు చోట్ల తనిఖీలు చేపట్టారు. పాతాళగంగ నుంచి క్షేత్రానికి సరఫరా అయ్యే వాటర్‌పంపింగ్ సిస్టమ్‌ను పరిశీలించారు.

కొరవడిన పర్యవేక్షణ



చాగలమర్రిలోని 11వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాలదే నిర్వహణ



11వ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త రెండు రోజుల పాటు హాజరు వేయని దృశ్యం

చాగలమర్రి: బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ, బాలలకు ఆటపాటలతో కూడిన విద్యనందించడం, పరిశుభ్రత తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించడంలో అంగన్‌వాడీలు కీలకం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టి లబ్ధిదారులు, చిన్నారులకు మెరుగైన సేవలందించేలా చర్యలు చేపట్టింది. అయితే కొందరు ఉన్నతాధికారుల పట్టించుకోనితనం, కార్యకర్తల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు సొంత పని మీద వెళ్లిపోతే ఆయాలే నిర్వహణ చేసుకుంటున్నారు. ఇలా రోజూ ఇదే పరిస్థితి అని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. విషయం తెలిసినా ఉన్నతాధికారులు ఉలుకూ పలుకు లేదు. స్థానిక 11, 14వ కేంద్రాలను బుధవారం పరిశీలంచగా.. కార్యకర్తలు విధుల్లో లేరు. ఉదయం అలా వచ్చి చూసి తమ పనుల్లోకి వెళ్లిపోయారని తెలిసింది. వారు సక్రమంగా రావడం లేదని స్థానికులు తెలిపారు. ఈ వ్యవహారంపై సూపర్‌వైజర్ సుశీలమ్మను ఫోన్‌లో సంప్రదించగా.. కొందరికి గొడిగనూరులో సెక్టార్ సమావేశం ఉందని, మరి 11, 14వ కేంద్రాల కార్యకర్తల గురించి తనకు తెలియదని ఆమె సమాధానమిచ్చారు. 11, 14వ కేంద్రాల్లో ఆయాలు గుర్రమ్మ, రహీమూన్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 11వ కేంద్రంలో కార్యకర్త కళావతి 29,30 తేదీల్లో హాజరు నమోదు చేయక పోగా, సెలవు కూడా పెట్టకపోవడం గమనార్హం. 14వ సెంటరు కార్యకర్త అనురాధ బుధవారం ఉదయం హాజరు వేసి వెళ్లిపోయింది.







వెంకటేశ్వరనగరంలో కూలీలతో మినుము కోతలు, డబ్ల్యూ.గోవిందిన్నెలో మినుము పంట కోత కోస్తున్న మిషన్,ఆరబోసిన మినుము ధాన్యం

మినుము కోతలు షురూ

దొర్నిపాడు: మొత్తానికి రైతుల చేతికి తొలిపంట మినుము వచ్చింది. ప్రస్తుతం మండలంలో మినుము కోతలు షురూ చేశారు. ఎక్కడ చూసినా పొలాల్లో మిషన్లు కనిపిస్తున్నాయి. కొందరు రైతులకు మిషన్లు దొరక్క పోవడంతో కూలీలతో కోయించుకుంటున్నారు. కోతలు వేగంగా పూర్తి చేసి వరి పంట సాగు చేయాలని రైతులు తలపోస్తున్నారు. ఇందుకు ఇప్పటికే నారు, ఎరువులు సిద్ధంగా ఉంచుకున్నారు. మినుము కోతలు పూర్తి చేసి వరినాటుకు పొలాలను మడులుగా మార్చాల్సి ఉంటుందని, త్వరగా నాటు వేస్తే పంటకు తెగుళ్లు తగ్గుతాయని చెబుతున్నారు. ప్రస్తుతం మినుములు ఎకరాకు 4నుంచి 6 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయని, ధర క్వింటా రూ.8వేల వరకు ఉందని రైతులు పేర్కొంటున్నారు. అదునుగా వర్షాలు కురిసి ఉంటే 8 బస్తాలకు పైగా దిగుబడులు వచ్చేవని చెబుతున్నారు.

విజయవంతం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): సీపీఐ బస్సు జాతను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర 1వ తేదీన నంద్యాలకు చేరుకుంటుందన్నారు. నంద్యాలలో జరిగే రాష్ట్ర సదస్సుకు వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు పాల్గొంటారని చెప్పారు.